ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 35.0 | కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 4 మార్చి 2025



విజ్జి ట్రోఫీకి ఎంపికైన పీయూ విద్యార్థి 7



రంజాన్ వేళలు
ఇఫ్తార్(మంగళవారం-6:31)
సహర్ (బుధవారం-5:12)

ఇంటర్ పరీక్షలకు..
సర్వం సిద్ధం



జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో కౌసర్‌జహాన్, డీఈసీ సభ్యులు

- 5 నుంచి మొదటి, 6 నుంచి ద్వితీయ సంవత్సరం ఎగ్జామ్స్
- ఉమ్మడి జిల్లాలో 124 కేంద్రాలు.. హాజరు కానున్న 65,219 మంది విద్యార్థులు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి మొదటి, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 124 కేంద్రాలు ఏర్పాటు చేయగా 65,219 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులంతా కేంద్రాలకు ఉదయం 8:45 గంటల వరకు చేరుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు చెప్పారు. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని భారీ బందోబస్తు నడుమ ఎగ్జామ్స్ నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆదేశించారు. దాంతో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల డీఐఈవోలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణకు ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ప్రత్యేక, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనుంది. 5 నుంచి 25వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్లు ఆదేశించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్ టికెట్లు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో కూడా హాల్‌టికెట్స్ తీసుకునేలా అవకాశం కల్పించారు. సోమవారం మహబూబ్‌నగర్ డీఐఈవో కౌసర్ జహాన్ డీఈసీ సభ్యులతో కలిసి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు ఇలా..

మహబూబ్‌నగర్‌లో 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 22,483 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. నారాయణపేటలో 16 కేంద్రాలు ఏర్పాటు చేయగా 8,791 మంది, జోగుళాంబ గద్వాల జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాటు చేయగా 8,341 మంది, నాగర్ కర్నూల్ జిల్లాలో 33 కేంద్రాలు ఏర్పాటు చేయగా 13,454 మంది పరీక్షకు హాజరుకానున్నారు. వనపర్తిలో 25 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 12,150 మంది విద్యార్థులు రాయనున్నారు.



మహబూబ్‌నగర్ బాలికల కళాశాల

కొత్త ఉపాధ్యాయులకు..
నేటి నుంచి శిక్షణ



ఎస్‌జీటీల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో ప్రవీణ్‌కుమార్(ఫైల్)

- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- మూడు రోజులు అవగాహన
- హాజరు కానున్న ఉమ్మడి జిల్లాకు చెందిన 260 మంది స్కూల్ అసిస్టెంట్లు, 91 మంది భాషా పండితులు
- విద్య, అభ్యసన ప్రమాణాల పెంపు, డిజిటల్ బోధన తదితర అంశాలపై ట్రైనింగ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 ద్వారా గత అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కొత్త స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు పలు అంశాల పై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ అంశాలపై వీరికి శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో గల ఉర్దూ మీడియం హైస్కూల్, బీపీహెచ్ఎస్‌లో విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 260 మంది స్కూల్ అసిస్టెంట్లు, 91 మంది భాషా పండితులకు శిక్షణ ఇవ్వనున్నారు. పాఠ్య పుస్తకాల సద్వినియోగం, తరగతి గది నిర్వహణ, విద్య, అభ్యసన ప్రమాణాల పెంపు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన పద్ధతులు, విధానాలు, తొలి మెట్టు, ఉన్నతి కార్యక్రమం, ఐసీటీ, ఐఎఫ్‌పీ, డిజిటల్ బోధన తదితర అంశాలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు ఈ నెల 10, 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నరు. ఉమ్మడి జిల్లాలోని వారంతా హైదరాబాద్‌లో శిక్షణకు హాజరు కానున్నరు.

ముగిసిన ఎస్‌జీటీల శిక్షణ

సెకండరీ గ్రేడ్ టీచర్లకు మూడు రోజుల శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణ ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో గత నెల 28, ఈ నెల 1, మూడు తేదీల్లో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణతో బోధనకు సంబంధించి ఎన్నో విషయాలు తెలుసుకున్నామని క్రొత్త ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులకు ఎలా బోధన చేయాలి?, పాఠశాలలో ఎలా మెలగాలి, డిజిటల్ బోధన తదితర విషయాలను నేర్చుకున్నామని అంటున్నారు.

ప్రత్యేక నిధులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలలు ఉన్నాయి. 13,659 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. గత అక్టోబరులో 951 మంది విధుల్లో చేరారు. వీరికి వివిధ కేటగిరీల వారీగా శిక్షణ ఇచ్చేందుకు రూ.7.37 లక్షలు కేటాయించారు. ఇప్పటికే గతంలో పని చేసే ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

జిల్లాల వారీగా ఉపాధ్యాయుల వివరాలు

జిల్లా పేరు	ఎస్‌జీటీలు	పీఈటీలు	స్కూల్ అసిస్టెంట్లు	భాషా పండితులు	స్పెషల్ టీచర్లు
మహబూబ్‌నగర్	144	7	35	22	6
నారాయణపేట	154	1	70	22	5
వనపర్తి	52	6	55	8	5
నాగర్‌కర్నూల్	129	2	66	13	-
జోగుళాంబ గద్వాల	77	8	34	26	4

అన్ని ఏర్పాట్లు చేశాం



ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ- 2024 ద్వారా అక్టోబరులో ఎంపికై, పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్, బాషా పండితులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నాం. సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇచ్చేందుకు జిల్లా కేంద్రంలోని రెండు పాఠశాలల్లో ఏర్పాట్లు చేశాం. మధ్యాహ్న భోజనం ఉంటుంది. ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలి.

- దుంకుడు శ్రీనివాస్, ఏఎంవో

వడదెబ్బకు గురవకుండా
అవగాహన కల్పించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురవకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశపు మందిరంలో వేసవి కాలపు వడగాల్పులు, తాగునీరు, విద్యుత్, ఇంటర్మీడియట్, పదవ తరగత పరీక్షల నిర్వహణ అంశాలపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయని, దీంతో వడగాల్పులు వీచే ప్రమాదం లేకపోలేదన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలపై పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహంచాలన్నారు. డాక్టర్ సలహాలను పాటించాలని సూచించారు. ఇంట్లోనే ఉండడం మంచిదన్నారు. బయటికి వెళ్తే తలపై టోపీలు ధరించాలని, సరిపోయినంత నీరు తాగాలన్నారు. దాంతో పాటు ఓఆర్ఎస్, నిమ్మ రసం, మజ్జిగ, పండ్ల రసాలు తాగాలన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున వారిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 5 నుండి 25 వరకు, 10వ తరగతి పరీక్షలు ఈ నెల 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగనున్నట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాలలో పోలీస్ బందోబస్తుతో పాటు 144 సెక్షన్ విధించాలన్నారు. కేంద్రాల పరిధిలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. పరీక్షల సమయానికి తగ్గట్టు విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పేపర్ లీకేజీలు, మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటివి జరుగకుండా చూడాలన్నారు. ప్రైవేట్ పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు తీసుకురావొద్దన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, ఏఎస్పీ రాములు, ఆర్‌డీవో నవీన్, ఇంటర్ విద్యాధికారి కౌసర్ జహాన్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, విద్యుత్, మెడికల్, ఆర్టీసీ, పోస్టల్, పోలీస్, పంచాయతీ రాజ్, సమాచార, మునిసిపల్, ఆర్ డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

సహాయక చర్యలు
వేగవంతం

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న కన్వేయర్ బెల్టు మరమ్మతు పనులు
- సమీక్ష సమావేశంలో నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

6



సహాయక బృందాల అధికారులతో సమీక్షా సమావేశంలో నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి, పెద్దకొత్తపల్లి మండలాలు, నాగర్‌కర్నూల్ పట్టణంలో ఘటనలు

7

వరకట్నం వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య

- బాలానగర్ మండలం గుండేడ్ గ్రామంలో ఘటన

బాలానగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వరకట్న వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని గుండేడ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ లెనిన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకొండ లక్ష్మి (30)కి రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామానికి చెందిన లింగమయ్యతో 17 సంవత్సరాల క్రితం పెళ్లి అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగమయ్య మూడు సంవత్సరాల క్రితం వరకట్న వేధింపులు పాల్పడగా తల్లిదండ్రులు రూ.లక్ష ఇచ్చారు. మళ్లీ గత నెల 28న డబ్బుల కోసం వేధింపులకు గురి చేయగా.. తల్లిగారి ఇంటికి గుండేడుకు వచ్చింది. ఈనెల 2న పెద్దల సమక్షంలో లింగమయ్య పంచాయితీ పెట్టారు. ఆ సమయంలో భార్య లక్ష్మిని అసభ్య పదజాలంతో దూషించగా.. అదే రోజు సాయంత్రం 6:30 గంటల సమయంలో ఆమె ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లి బాలానగర్ మండలం పెద్దయపల్లి గ్రామ శివారులోని దుందుభి వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

లోపలి పేజీల్లో..



వడ్లు, బియ్యం తరలిస్తున్న ఏడు లారీల పట్టివేత

- నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు చెక్‌పోస్టు వద్ద అదుపులోకి..
- తెలంగాణ నుంచి కర్ణాటక వెళ్తుండగా వెంటాడి పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

7



ఫస్ట్ నవరత్నాల మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి

7

దుర్గంధంలో దుర్భరంగా..

- పస్తుల్లో పంచాయతీ కార్మికులు
- ఎంత పనిచేసినా మారని జీవితాలు
- నాలుగు నెలలకోసారి వేతనం
- ప్రమాదం జరిగినా, మరణించినా పట్టించుకోని అధికారులు

7

ఇంటర్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

- ఇక పరీక్ష కేంద్రాల అడ్రస్ గుర్తింపు సులభం

నారాయణపేట: ఇంటర్ పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా విద్యా శాఖ ఈ సారి స్మార్ట్ హాల్ టికెట్‌లను తెచ్చింది. పరీక్షా కేంద్రాల అడ్రస్ తెలియక విద్యార్థులు పడే ఇబ్బందులకు చెక్ పెట్టేలా వాటిపై క్యూఆర్ కోడ్‌లను ముద్రించింది. దానిని స్కాన్ చెయ్యగానే కళాశాలకు సంబంధించిన గూగుల్ మ్యాప్‌లో పరీక్షా కేంద్రం కనిపిస్తుంది. ఇది ఎంతగానో ఉపయోకరంగా ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంటున్నారు.



జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మహబూబ్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని, కక్షిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరగడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు వ్యయప్రయాసాలకు గురవుతుంటారని, అందుకే న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్‌తో పాటు జడ్చర్ల కోర్టులోనూ ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కేసులలో రాజీ అయితే మళ్లీ అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. యాక్సిడెంట్, ఛీటింగ్, కొట్టుకున్న, వివాహ కేసులు, చిన్నచిన్న దొంగతనాలు, డ్రంకెన్ డ్రైవ్‌తోపాటు రాజీ కాదగినవి పరిష్కరించుకోవచ్చన్నారు.

గర్భిణులను నిశ్చయ్ కిట్ల ద్వారా పరీక్షించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సౌభాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సౌభాగ్యలక్ష్మి

నారాయణపేటటౌన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు నిశ్చయ్ కిట్ల ద్వారా పరీక్షించి గర్భిణులుగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సౌభాగ్యలక్ష్మి తెలిపారు. సమీకృత అధిక ప్రమాద గర్భధారణ నిర్వహణ నియమాలపై సోమవారం పేట జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి హాజరై, మాట్లాడారు. ప్రతీ గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు, ఎల్ఎంపీ రిజిస్టర్ ఆధారంగా అర్హులైన దంపతుల్లో గర్భిణులను నిశ్చయ్ కిట్ల ద్వారా పరీక్షిస్తూ గర్భిణులుగా నమోదు చేయాలన్నారు. నమోదు సమయంలో ఏవైనా ప్రమాద సంకేతాలు ఉన్నాయో లేదో తెలుసుకోవాలని సూచించారు. శిక్షణ అధికారులు డా.రోహిణి మాట్లాడుతూ గర్భిణుల్లో కన్పించే అధిక ప్రమాదకర కారణాలు, వ్యాధుల గురించి తెలిపారు. కార్యక్రమంలో డా.శైలజ, భార్గవి, గోవిందరాజు, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు

ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



సమావేశంలో మాట్లడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే పదవులు ఇస్తామని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా పంచాయతీరాజ్ సంఘటన్ రివ్యూ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు రాచమల్లు సిద్దేశ్వర్, పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిలు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరిని గుర్తించాలని, కొత్తగా వచ్చిన టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారన్నారు. ఆమె సూచనల మేరకే ఈ సమావేశం నిర్వహించామన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు అందించాలని భావించి అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఐదంచెల విధానాన్ని దేశమంతటా ప్రవేశపెట్టారన్నారు. కానీ పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీలు ఇటు రాష్ట్రాన్ని, అటు దేశాన్ని అప్పులకుప్పలుగా మార్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడే విధంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడ్డ వారికి టికెట్లు ఇచ్చి గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మద్దూర్ పీఏసీఎస్ చైర్మన్ నరసింహ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.గౌస్, పట్టణ అధ్యక్షుడు ఎండీ. సలీం, మండలాల అధ్యక్షులు రఘువర్దన్‌రెడ్డి, నరహరి, సుధాకర్, కోట్ల రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.


పీయూలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తదితరులు

రాజకీయాలకు వన్నె తెచ్చిన వ్యక్తి శ్రీపాదరావు

● పీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీపాదరావు నైతిక విలువలు పాటించి, రాజకీయాలకు వన్నె తెచ్చారని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూ పరిపాలన భవనంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడు అన్నారు. పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప మాట్లాడుతూ ఆయన రాజకీయ జీవితం సర్పంచ్‌తో మొదలై అసెంబ్లీ స్పీకర్ దాక వెళ్లిందన్నారు. పీజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ రవికాంత్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్ పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

మూసాపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఎండోమెంట్ ఇన్స్‌స్పెక్టర్ వీణధారి, ఈవో రాజేశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో లెక్కించగా మొత్తం రూ.4,06,945 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఏడాదిలో రెండు సార్లు హుండీని లెక్కించగా, జాతరకు ముందు జాతర తర్వాత హుండీని లెక్కిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కె.నాగిరెడ్డి, తోట శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు నగదు పురస్కారం అందజేత

● ప్రథమ బహుమతి రూ.44,444.. ద్వితీయ బహుమతి రూ.22,222

నారాయణపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో ఫ్రెండ్స్ ప్రైమర్ లీగ్-2 ఆధ్వర్యంలో స్థానిక క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు కరణ్ ఫ్రెండ్స్, లోకల్ బాయ్స్ ఆర్థిక సహకారంతో నగదు పురస్కారాన్ని సోమవారం అందించారు. ఫైనల్ పోటీల్లో గెలుపొందిన ఆర్ఎస్-11 జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.44,444 నగదు, కరుణ ఫ్రెండ్స్‌కు ద్వితీయ బహుమతిగా రూ.22,222 నగదు అందుకున్నారు. క్యాప్టన్లు నస్సీర్‌అలీ, సూరి, కరుణ ఫ్రెండ్స్, లోకల్ బాయ్స్ తదితరులున్నారు.



ప్రథమ బహుమతి అందుకున్న ఆర్ఎస్-11 జట్టు

ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి

● కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలే పదేపదే చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ పూర్తి కాలేదని, మూడు ఎకరాల వరకు రైతుబంధు పూర్తిగా పడలేదన్నారు. వనపర్తి సభలో మాట్లాడుతూ కేసీఆర్ పాలమూరును ఎండబెట్టాడని అనడం సరికాదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పనులు పూర్తయ్యాయని, పది శాతం పనులు పూర్తయితే పాలమూరు భూములకు కృష్ణానది నీరు అందుతుందన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ సాయిలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోశప్ప, నరేందర్‌రెడ్డి, నాయకులు చెన్నప్ప ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

'దివ్యాంగులకు అవకాశంపై చట్టం చేయాలి'

పాలమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిత్యం కోసం అసెంబ్లీలో చట్టం చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నల్లవెల్లి కురుమూర్తి ప్రసంగించారు. 2012 నుంచి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ.300 మాత్రమే చెల్లిస్తుందని, దీంతో దివ్యాంగులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. నిత్యావసర సరుకుల ధరలు 300 రెట్లు పెంచిన మోదీకి దివ్యాంగుల పెన్షన్ పెంచాలనే ఆలోచన ఎందుకు రావటం లేదన్నారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండి చేయి చూపారన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని జిల్లా అధ్యక్షుడు టి.మధుబాబు అన్నారు. ప్రతీ దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్‌కార్డు మంజూరు చేయాలన్నారు. కార్యదర్శి రామకృష్ణ, పారిజాత, మొగులయ్య పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

జడ్చర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన రెండు కార్లను మంగళవారం ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత


మదనాపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థి

మదనాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని దుప్పల్లి జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం వికటించి ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. ఆ తర్వాత ముగ్గురు 10వ తరగతి విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పితో బాధపడ్డారు. వారిని వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చేయించారు. ఇద్దరికి అస్వస్థత మరో విద్యార్థి అజయ్‌కుమార్‌కు వాంతులు కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విద్యార్థిని పరీక్షించగా బీపీ తక్కువగా ఉండడం, కడుపులో నొప్పి ఉండడంతో చికిత్స అందిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవానీ తెలిపారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలి

మునిసిపల్ కార్యాలయం ఎదుట యువకుడి నిరసన

అమరచింత, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతూ అమరచింత ఎస్సీ కాలనీకి చెందిన ఫిరోజ్ సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాడు. ఈ సందర్భంగా ప్లకార్డుతో కార్యాలయం ఎదుట బైఠాయించి అనంతరం మాట్లాడారు. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా కందకం స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించినా.. నేటికీ మునిసిపల్ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని అన్నారు. తక్షణమే ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా అధికారికంగా గుర్తించి సూచిక బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, మునిసిపల్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్నిఅందజేశారు.

అయిజలో డీసీసీబీ ఏర్పాటు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో

అయిజ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అయిజలో నూతనంగా డీసీసీబీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో పురుషోత్తం తెలిపారు. సోమవారం సాయంత్రం అయిజ సింగిల్ విండో అనుబంధంగా నిర్వహిస్తున్న సూపర్‌మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార సంఘాలు రైతు అభివృద్ధి, అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండాలని, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కృషితో ప్రస్తుతం బ్యాంకు లాభాల్లో ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరిన్ని బ్యాంకులు ఏర్పాటు చేస్తామని, అందులో అయిజలో ప్రధానమని అన్నారు. వచ్చే వానకాలం నాటికి అయిజలో బ్యాంకు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమములో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, గద్వాల బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం

● ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న కన్వేయర్ బెల్టు మరమ్మతు పనులు

● సమీక్ష సమావేశంలో నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో వేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు కన్వేయర్ బెల్టు పనులు వేగవంతం చేసినట్లు నాగర్ కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాలుపంచుకుంటున్న బృందాల అధికారులతో, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ టన్నెల్ ఇన్‌లెట్ ఆఫీస్ వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టులో సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కన్వేయర్ బెల్టు మరమ్మతు పనులు వేగవంతం చేసి ఎస్ఎల్‌బీసీ ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. డీవాటరింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని రెస్క్యూ ఆపరేషన్‌లో పాలు పంచుకుంటున్న బృందాల అధికారులతో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రమాద ప్రదేశంలో జరుగుతున్న సహాయక చర్యలకు ఎదురవుతున్న సమస్యలపై విశ్లేషించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న 12 సంస్థలకు సంబంధించిన బృందాలతో అధికారులు సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక అధికారులతో సలహాలు, సూచనలు తీసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో సొరంగంలో మట్టి, బురద, కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలోకి మీద నుంచి ఇరువైపుల నుంచి నీరు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. సొరంగంలో ఇప్పటికే నిల్వ ఉన్న నీటిని తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యంత్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని అధికారులు వివరించారు.

ఐక్యతతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ ఐక్యతతో ఉంటే అభివృద్ధి సాధ్యమని, దైవానుగ్రహంతో గ్రామం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. గ్రామాల్లో ఆలయాలు ఉండటం వల్ల మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆయన ప్రారంభించారు. నూతన ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేను స్థానిక నాయకులు, గ్రామస్థులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో బడి, గుడి తప్పనిసరిగా ఉండాలన్నారు. దేవున్ని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల శాంతి నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.


ఖమ్మంపాడులో హారతి ఇచ్చి ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

ప్రీ ఫైనల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి

ధరూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించాలని డీసీఈబీ(డిస్ట్రిక్ కామన్ ఎక్జామినేషన్ బోర్డు) సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఎస్‌సీ ప్రీ ఫైనల్ టెస్ట్-2 పరీక్షలను సోమవారం ధరూరు మండల గార్లపాడు ఎంపీహెచ్ఎస్‌లో పరిశీలించారు. ముందుగా పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులతో సమావేశమైన ప్రతాప్‌రెడ్డి పదో తరగతి పబ్లిక్ పరీక్షల యాక్షన్‌ప్లాన్ ఏవిధంగా అమలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు ప్రతీ విద్యార్థి హాజ రయ్యేలా చర్యలు తీసుకోవాలని డీసీఈబీ సెక్ర టరీ ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో తప్పనిసరిగా నంబర్ వేసి జవాబు పత్రం ఇవ్వాలన్నారు. ఇంగ్లిష్, గణితం, పరీక్షలకు మోడల్ ఓఎంఆర్‌తో పరీక్షలు నిర్వహించాలన్నారు. మండలంలోని అన్ని పాఠ శాలల హెచ్ఎంలకు ఎంఈవోల ద్వారా ఈ నెల 5న ఓఎంఆర్‌లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.


ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ప్రతాప్ రెడ్డి

మాధవ రెడ్డి సేవలకు తగిన గుర్తింపు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి అర్బన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : కొన్ని ఏళ్ల పాటు నియోజకవర్గంలో ఉచిత వైద్యసేవలు అందించిన మా సోదరుడు జిల్లెల మాధవరెడ్డి చేసిన సేవల కు తగిన గుర్తింపు దక్కిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వనపర్తి మండలంలోని కాశీంనగర్ ఎత్తిపోతల పథకానికి తన సోదరుడు మాధవరెడ్డి పేరు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించారని చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సభలో ఎత్తిపోతల పథకానికి మాధవరెడ్డి పేరు పెట్టాలని చీఫ్ సెక్రెటరీకి ఆదేశాలు ఇచ్చారని, దీంతో తన సోదరుడు చేసిన సేవలకు గుర్తింపు దక్కిందన్నారు. ఈ ఎత్తిపోతల పథకంతో 4 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఆరు గ్రామాలు, 13 గిరిజన తండాల్లోని సాగు భూములకు నీరు అందనున్నట్లు తెలిపారు. కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ సహ ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండడంతో కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్ స్కీమును రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో 12 లక్షల ఎకరాలకు సాగునీరు

సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్

గద్వాల, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్ది 12లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసింది కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల గురించి రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండి పోతిరెడ్డిపాడుకు జీవోను తెస్తే కేసీఆర్ వ్యతిరేకించాడని వివరించారు. పాలమూరు ప్రాజెక్టులను గత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెడితే వాటిని దాదాపుగా పూర్తి చేసింది కేసీఆర్ అని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాగార్జున సాగర్, ముచ్చుమర్రి, పోతిరెడ్డి పాడుల నుంచి నీటి దోపిడి చేస్తుంటే అడ్డుకోలేని మీరు కేసీఆర్ గురించి చిల్లర మాటలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

'జిజ్ఞాస' పోటీలకు నాలుగు ప్రాజెక్టులు ఎంపిక

- గైడ్ అధ్యాపకులకు ప్రిన్సిపాల్ అభినందన

గద్వాల టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస' పోటీలకు స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ నెల 4వ తేదీ నుంచి హైదరాబాద్ నాంపల్లి ఉమెన్స్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస' పోటీల్లో ఎంపికైన ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. గద్వాల అధ్యాపకుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

విజ్జి ట్రోఫీకి పీయూ విద్యార్థి ఎంపిక


డెవిడ్‌క్రిపాల్ ను అభినందిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ప్రొఫెసర్ సత్యభాస్కర్ రెడ్డి, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న విజ్జి (పూసాపాటి విజయ ఆనంద గజపతి రాజు) జాతీయ క్రికెట్ పోటీలకు పీయూ విద్యార్థి డెవిడ్ క్రిపాల్ ఎంపికయ్యారు. జాతియ స్థాయిలో యూనివర్సిటీ విద్యార్థులకు నిర్వహించే ఈ క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ డెవిడ్ క్రిపాల్‌ను అభినందించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిస్తే రంజీ, ఐపీల్ పోటీలో పాల్గొనేందుకు అవకాశాలు లభిస్తాయని పీడీలు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ప్రొఫెసర్ సత్యభాస్కర్ రెడ్డి, అధికారులు, పీడీ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఆర్చరీ క్రీడాకారులకు అభినందన

» జాతీయ స్థాయి ఆర్చరీలో పోటీలకు జిల్లా క్రీడాకారులు


జాతీయ స్థాయి ఆర్చరీ టోర్నీకి ఎంపికైన జిల్లా క్రీడాకారులతో జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి, జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయాధికారి కళ్యాణ్‌చక్రవర్తి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కోల్లూర్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ టోర్నీలో జిల్లా క్రీడాకారులు అండర్-10,13, 15 విభాగాల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించారు. సోమవారం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి, జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయాధికారి కళ్యాణ్‌చక్రవర్తి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువిద్యలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగడం అభినందనీయమని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు 18 మంది ఎంపికైనట్లు కోచ్ జ్ఞానేశ్వర్ తెలిపారు. అండర్-10 విభాగంలో శ్రీహిత, సిద్దిక్ష, అయేజఫాతిమా, రోషన్, హిమనిష్, రోహన్, అండర్-13లో సమీక్ష, షేర్వాని, అయేషఫాతిమా, సానిబ, డి. సమీక్ష, కృతిక్‌శ్రీవాస్తవ్, మణీశ్వర్, చంద్రనీల్, అండర్-15లో సానిబ, సమీక్ష, షేర్వాని ఎంపికయ్యారు. న్యాయ మూర్తులు విజయ్ కుమార్, ఉదయ్‌నాయక్, ఏఈ సీనియర్ సూపరింటెండెంట్‌లు మూర్తి, జగన్, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి సృజన టెక్‌ఫెస్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాల సృజన టెక్‌ఫెస్ట్ మంగళవారం నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి. మోహన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెక్‌ఫెస్ట్‌కు వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పెబ్బేరు కళాశాల, కోస్గి కళాశాల, వడ్డేపల్లి కళాశాల నుంచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో
ముగ్గురి మృతి

బిజినేపల్లి/నాగర్‌కర్నూల్ క్రైం/పెద్దకొత్తపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరుగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొట్టుకోవడంతో బైక్‌పై వెళ్తున్న జటావత్ జాన్ నాయక్ (34) అనే యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మిట్యా తండా పంచాయతీ పరిధిలోని భీముడి తండాకు చెందిన మృతుడు జాన్ నాయక్ స్వంత పనిమీద బిజినేపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బిజినేపల్లి వైపు వస్తుండగా వెల్గొండ గేట్ సమీపంలో ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న జాన్ నాయక్ తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతుండగా 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో భార్య కవిత, కుమారుడు అభి, కూతుళ్లు మౌనిక, హరికలు కన్నీరు మున్నీరుగా విలపించారు. మూడు రోజుల క్రితం వరకు శివస్వామి మాలధారణ వేసుకొని శ్రీశైలం వెళ్లి వచ్చిన మృతుడు జాన్ నాయక్ అకాల మృతి చెందడంతో తండా వాసులు గోవిందు నాయక్, మాన్యానాయక్, అమర్ నాయక్, పూల్యానాయక్, చందులాల్, కృష్ణనాయక్, రాజు నాయక్ తదితరులు ఆవేదన వ్యక్తం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.


జాన్ నాయక్ (ఫైల్)

ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి..

రోడ్డు ప్రమాదంలో భోగమోని శ్రీనివాస్‌యాదవ్ (46)మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్ నాగర్‌కర్నూల్ పట్టణంలోని మారుతి షోరూమ్ సమీపంలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోవర్ధన్ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఆర్ఎంపీ..

పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని సాతాపూర్ సమీపంలో రుసలయ్యకుంట వద్ద 167కే జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ ఆర్ఎంపీ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరొకరిని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన మొల్లకుంట వెంకటయ్య చిన్న కొడుకు మొల్లకుంట సాంబశివుడు(25)కోడేరు మండలం మాచుపల్లి గ్రామంలో ఆర్ఎంపీగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అప్పుడప్పుడు తన స్వగ్రామానికి వస్తూ పోతూ ఉండేవాడు. ముష్టిపల్లికి వచ్చిన అతను ఆదివారం రాత్రి 9గంటల సమయంలో తన బావ నల్లపోతుల జగదీశ్‌ను కుడికిళ్ల గ్రామంలో దింపి రావడం కోసం తన స్వంత బైక్‌ను జగదీశ్‌కు ఇచ్చాడు. అతడు తన బామ్మర్ది అయిన ఆర్ఎంపీ సాంబశివుడిని ఎక్కించుకొని వెళ్లారు. మార్గమధ్యంలో సాతాపూర్ శివారులో రుసలయ్యకుంట సమీపంలో వెళ్తున్న వీరి బైకును ఎదురుగా మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. సాంబశివుడు ఎగిరి పడి ప్రాణాలు విడి చాడు. జగదీశ్‌ను చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. ప్రమాదానికి కారణమైన పెబ్బేటి మల్లేష్, సాతాపూర్‌కు చెందిన సంగనమోని శ్రీకాంత్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి మొల్లకుంట వెంకటయ్య సోమవారం పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ సతీష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



సాంబశివుడు (ఫైల్)

దుర్గంధంలో.. దుర్భరంగా..

● పంచాయతీ కార్మికుల వేతన వ్యథలు


మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు(ఫైల్)

» పస్తుల్లో పంచాయతీ కార్మికులు » ఎంత పనిచేసినా మారని జీవితాలు
» నాలుగు నెలలకోసారి వేతనం » కనీస వేతనానికి నోచుకోని కార్మికులు
» ప్రమాదం జరిగినా, మరణించినా పట్టించుకోని అధికారులు
» 2019లో జీవో ఎంఎస్ 51తో మల్టీపర్పస్ వర్కర్‌గా పేరుమార్పు
» జిల్లాలో 1513 మంది కార్మికులు
» పోరాటాలు చేసినా పట్టించుకోని పాలకులు

● మునిసిపల్ కార్మికులకు ఉన్న వేతనాలు లేవు



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు మునిసిపల్ కార్మికులకు ఉన్న వేతనాలు కూడా లేవు. వేతనాలు లేకపోవడంతో పాటు పనిగంటల విధానం అమలులో లేదు. దీంతో కార్మికులు వెట్టిచాకిరి చేస్తున్నారు. ఎంపీడీవోలు గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులందరికీ ఆరోగ్యబీమా చేయించాలి. ఎక్కడా చేయించడం లేదు. వారికి పనిగంటల విధానం అమలు లేదు. కొన్ని చోట్ల ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులు చేయిస్తున్నారు.

- వెంకటయ్య గౌడ్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్


తన భర్తకు న్యాయం చేయాలంటూ గత ప్రజావాణిలో వినతి పత్రంతో మహ్మదాబాద్‌కు చెందిన వెంకటయ్య భార్య వెంకటమ్మ (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో పనిచేసే కార్మికులు కనీస వేతన అమలుకు నోచుకోవడం లేదు. గత 30ఏళ్లుగా పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను 2019లో ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్స్‌గా కొనసాగిస్తున్నది. కానీ వేతనాలు మాత్రం పెంచడం లేదు. కార్మికులుగా ఉన్నప్పుడు నెలకు రూ.8,500 ఇచ్చిన ప్రభుత్వం, ఎంపీఎస్‌డబ్లూలుగా మార్చిన అనంతరం రూ.1000 వేతనం పెంచి కార్మికులతో వెట్టి చేయించుకుంటుంది. తమకు కనీస వేతనం అందించాలని పలుమార్లు జిల్లా కేంద్రంలో, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల స్పందించడం లేదు. తమకు కనీస వేతనం అందించాలని, అందరు ఉద్యోగులుగానే మాకు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నా పాలకుల చెవులకు వినిపించడం లేదు. గత ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇచ్చేది చాలీచాలని వేతనం.. అదికూడా నెలనెలా రాకపోవడంతో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారికి కనీస వేతనం ఇవ్వడంతో పాటు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించినట్లుగా వైద్య సదుపాయాలు, పనిగంటల విధానాలు అమలు చేయాలని వారు ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్నా వారి రోదన అరణ్యంగానే మిగిలింది. నేడు సగటు మనిషి ఒకరోజు పనికి వెళ్తే రూ.500 నుంచి రూ.600 వరకు వస్తున్నాయి. ఆ డబ్బులు వచ్చినా పెరిగిన నిత్యవసర ధరలకు సరిపోవడం లేదు. రోజూ రూ.300తో పంచాయతీ కార్మికులు తమ కుటుంబాలను ఎలా నెట్టుకొస్తారో ఉన్నతాధికారులు, పాలకులు ఆలోచించాలి. వారి వేతనాలు పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● జీవోఎంఎస్ 51తో ఎంపీడబ్ల్యులుగా మార్పు

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 సంవత్సరంలో జీవో ఎంఎస్ 51తో అప్పటి వరకు పంచాయతీ కార్మికులుగా ఉన్న వారిని మల్టీపర్పస్ వర్కర్లుగా పేరు మార్పు చేసింది. అప్పటి వరకు వారినెల జీతం రూ 8,500 ఉండగా, అదనంగా వెయ్యి పెంచింది. నాటి నుంచి అదే వేతనంతో కార్మికులు తమ జీవితాలను గడుపుతున్నారు. వారి బ్యాంకు ఖాతాలు కూడా చాలామంది కార్మికులవి జీరో ఖాతాలు, లావాదేవీలు నిర్వహించని ఖాతాలు కావడంతో బ్యాంకర్లు కూడా అకౌంట్‌లో డబ్బులు పడ్డ వెంటనే ఇవ్వడం లేదు. పడ్డ జీతాల కోసం వారు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది.

● పట్టించుకోని అధికారులు

పంచాయతీ కార్మికులు విధి నిర్వహణలో భాగంగా ప్రమాదాల బారినపడ్డా.. ప్రాణాలు కోల్పోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. నవాబ్‌పేట మండలంలోని గురుకుంట గ్రామంలో గత నెలరోజుల క్రితం డంపింగ్ యార్డులో చెత్తను తగులబెడుతుండగా చెన్నమ్మ అనే కార్మికురాలికి ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని శరీరం కాలింది. 25 రోజుల పాటు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత ఐదు రోజుల క్రితం మరణించింది. ప్రమాద బీమా లేకపోవడంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి చిల్లీగవ్వ కూడా రాలేదు. దహన సంస్కారాలకు రూ. 10వేలు గ్రామ పంచాయతీ నుంచి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మహ్మదాబాద్ మండల కేంద్రంలో వెంకటయ్య అనే పంచాయతీ కార్మికుడు చెత్త ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు పడి గాయపడ్డాడు. నేటికీ ఎస్వీఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి భార్య వెంకటమ్మ నా భర్తను కాపాడాలని కలెక్టర్ విజయేందిర బోయికి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. నేటికీ చికిత్స నిమిత్తం వారు రూ.3లక్షల దాకా అప్పు చేశారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు.

● అసెంబ్లీ ముట్టడి చేసినా చలించని ప్రభుత్వం



కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని మండల, జిల్లా కేంద్రాలతో పాటు సాక్షాత్తూ అసెంబ్లీ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదంలో గాయపడిన, మరణించిన కుటుంబాలను సైతం పట్టించుకోవడం లేదు.

- నల్లవెల్లి కురుమూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

● డిసెంబరు వరకు చెల్లించాం



గతంలో గ్రామ పంచాయతీల ద్వారా కార్మికుల వేతనాలు చెల్లింపులు చేపట్టేది. 2024 డిసెంబర్‌లో ఆన్‌లైన్ ద్వారా జీతాలు చెల్లిస్తున్నాం. ఎంపీడబ్ల్యూ (మల్టీపర్పస్ వర్కర్స్) వేతనాలు ప్రభుత్వం డిసెంబర్ వరకు విడుదల చేసింది. విడుదల చేసిన వేతనాలను వారి ఖాతాల్లో జమచేశాం. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలకు, ఎంపీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడబ్ల్యూ ఆరోగ్యబీమా చేయించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

- పార్థసారథి, డీపీవో, మహబూబ్‌నగర్

గురుదేవోభవ..

» ఉద్యోగ విరమణ పొందినా విద్యార్థులకు బోధన

హన్వాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి విద్యను అందించి గురుకులాల్లో చేరి ఉన్నత చదువులు చదవుకోవాలనే తపనతో ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. ఉద్యోగవిరమణ పొందినా తను పని చేసిన పాఠశాలలో చదువు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని దొర్రితండా ప్రాథమిక పాఠశాలలో 75 మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్నారు. అయితే అక్కడే పని చేస్తున్న ఉపాధ్యాయుడు పుల్లయ్య గత సంవత్సరం అక్టోబరులో పదవీ విరమణ పొందారు. మరో ఉపాధ్యాయుడు మల్లేష్ బదిలీపై వెళ్లారు. దీంతో గురుకుల కోసం ఎంతో ఆశతో అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు కొంత నిరాశ చెందారు. అయితే విద్యార్థులకు ఈ అకాడమిక్ సంవత్సరంలో ఎలాంటి ఇబ్బందులు కల్గకూడదని రిటైర్డ్ ఉపాధ్యాయుడు పుల్లయ్య రోజూ పాఠశాలకు వచ్చి బోధిన్నారు.

అక్కడ పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు విజయమోహన్, ప్రకాష్‌గౌడ్ కూడా తమవంతు సహకారంతో నడిపిస్తున్నారు.


పాఠాలు చెపుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు

విద్యార్థులకు నష్టం కలగకుండా ఉండాలనే తపనతో...



పదవీ విరమణ పొందిన తర్వాత కూడా పాఠశాలకు వచ్చి పాఠాలు చెపుతున్నాను. ప్రధానంగా హన్వాడ నుంచి 45 మంది విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చి చదువుకుంటున్నారు. వారందరు గురుకులంలో చేరేందుకు ఇష్టంతో విద్యనభ్యసిస్తున్నారు. అలాంటి విద్యార్థులకు నష్టం కలుగకూడదని సొంత ఖర్చులతో పాఠశాలకు వచ్చి చదువు చెపుతున్నాను.

- పుల్లయ్య

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై సీఎం మౌనం వీడాలి

» కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

పాలమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పై ముఖ్యమంత్రి మౌనం వీడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరుగుతున్న కేవీపీఎస్ రాష్ట్ర సమావేశాలు రెండో రోజున కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ప్రసంగించారు. తక్షణమే అంబేడ్కర్ అభయహస్తానికి మార్గదర్శకాలు ప్రకటించాలన్నారు. ఏప్రిల్ మాసం పూర్తిగా పూలే, అంబేడ్కర్‌లకు సంబంధించిందన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనువాదం దళిత మహిళా హక్కులు అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల అణచివేతకు మహిళల అత్యాచారాలు, హింస పెరగడానికి మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలే ప్రధాన కారణమన్నారు. జ్యోతిబా పూలే, అంబేడ్కర్ జయంతులను పురస్కరించుకుని ఏప్రిల్ మాసం పూర్తిగా మహనీయుల మాసంగా ప్రకటించుకుని రాష్ట్ర వ్యాప్తంగా కులవివక్ష, అంటరానితనం ఏ గ్రామంలో ఉన్నా సమగ్ర అధ్యయనం చేసి దానిపై ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందినా చంద్రయాన్ ప్రయోగం జరిగినప్పటికీ నేటికి కులవివక్ష, అంటరానితనం కొనసాగటం సిగ్గుచేటన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ఏడాదికి రూ.750కోట్ల చొప్పున కేటాయించాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, అసైన్డ్ భూమి హక్కు దారులకు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు సైతం రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11నెలల క్రితం దళితుల కోసం ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, అతిమెల మాణిక్యం అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సమావేశంలో ఎం.అడివయ్య, ఎం.కురుమయ్య, నందిపాటి మనోహర్, అరూరి కుమార్, డి.రాధాకృష్ణ, ఎం.ప్రకాశ్‌కారత్, టి.సురేష్, మంద సంపత్, దినకర్, రాంమూర్తి, పిలిజాల పరశురాములు, ఎన్.బాలపీరు, బి.బాలకిషణ్, గుర్రం దేవేందర్, మల్కయ్య, దేవదానం, శ్రావణ్, మర్రి నాగేశ్వరరావు, మల్లెల మాణిక్యం రాజులు పాల్గొన్నారు.



సమావేశాల్లో ప్రసంగిస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

వడ్లు, బియ్యం తరలిస్తున్న ఏడు లారీల పట్టివేత

కృష్ణ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వడ్లు, బియ్యం లోడుతో తెలంగాణ రాష్ట్రం నుంచి కర్ణాటక ప్రాంతానికి తరలిపోతున్న ఏడు లారీలను సోమవారం సాయంత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంబడించి పట్టుకున్నారు. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేష్ తన సిబ్బంది సహకారంతో ఈ లారీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల మేరకు.. వడ్లు, బియ్యం లారీలు వెళ్తున్నట్లు సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రభాకర్, ఏఎస్ఐ పండారి టీం ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ పంచాయతీ కృష్ణానది ఒడ్డున ఉన్న చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ కాపుకాసారు. దేవరకొండ, నిడమనూరు, గరిడేపల్లి, ఉమ్మడి పాలమూరు మీదుగా నారాయణపేట, జాజాపూర్ దాటి వెళ్తున్న లారీలను వెంబడించారు. ఆ ఏడు లారీల్లో ప్రభుత్వ బ్యాగుల్లో వడ్లు, బియ్యం ఉండటంతో పట్టుకున్నారు.

డ్రైవర్ల వద్ద ఇక్కడి నుంచి అక్కడకు వెళ్లడానికి కావాల్సిన వే బిల్లులు, మార్కెట్ సెస్ తదితరులు ధ్రువీకరణ పత్రాలు లేక పోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 7 లారీలలో నలభై కేజీల బరువు గల దాదాపు 4500 బస్తాలు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఫస్ట్ నవరత్నాల
మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి

» అభ్యర్థులకు ఫైనల్ పరీక్ష నిర్వహణ
» రెండో బ్యాచ్‌లో మగ్గం వర్క్‌లో శిక్షణ

మహబూబ్‌నగర్, మార్చి 3 (ఆంధజ్యోతి): ఫస్ట్ నవరత్నాలు శిక్షణ కేంద్రంలో మొదటి బ్యాచ్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసింది. వీరికి ఫైనల్ పరీక్షను సోమవారం నిర్వహించారు. 224 మంది మహిళలకు కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. నగరంలోని బీకే రెడ్డికాలనీలో ఫస్ట్ నవరత్నాలు పేరిట మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు నిర్వహించిన ఫైనల్ పరీక్షను సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుశిక్షితులైన అధ్యాపకులను నియమించి శిక్షణ తరగతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారని, మొదటి బ్యాచ్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవడం అభినందనీయమని తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి సెట్విన్ సర్టిఫికెట్‌తో పాటు బ్యాంక్‌ల ద్వారా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి రుణాలు ఇప్పించే కార్యక్రమాలు చేస్తారన్నారు. మగ్గం వర్క్స్‌పై రెండో బ్యాచ్‌కు త్వరలో శిక్షణ ఇస్తారని, ఇందుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం అయిందన్నారు. గతంలో శిక్షణకు అవకాశం రాని వారంతా ఈ విడత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెట్విన్ మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, నవరత్నాలు పర్యవేక్షకుడు గుండా మనోహర్, ఇన్‌చార్జి నిజలింగప్ప పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పతకాలతో విద్యార్థులు

మక్తల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు జరిగిన నాల్గవ సౌత్‌జోన్ జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కబరిచారు. మక్తల్ నియోజకవర్గం నుంచి 12 మంది క్రీడాకారులు తెలంగాణ తరఫున ఆడి క్రీడా నైపుణ్యత ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఐదు బంగారు పతకాలు, ఏడు వెండి పతకాలు సాధించినట్లు షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పట్ల షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సత్య అంజనేయులు, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి అభినందించారు.

న్యూస్ బాక్స్

తహసీల్దార్‌కు ఫిర్యాదు

నవాబ్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 32లో ఉన్న దర్గాను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన జమీల్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, కేశవులు, రాజు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

జడ్చర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన రెండు కార్లను మంగళవారం ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గండి భీమయ్యపై కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. హన్వాడ మండలం కిష్టంపల్లి గ్రామం నుంచి మహమ్మదాబాద్ మండలం జూలపల్లికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెండింగ్ ఈ చలానా చెల్లించాలి

మహబూబ్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తమ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలను వెంటనే చెల్లించాలని, తనిఖీల్లో వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. వాహన నిబంధనలు పాటించాలని హెల్మెట్ విధిగా వినియోగించాలని కోరారు. నెంబర్ ప్లేట్ లేకుండా కనిపించకుండా జిగ్‌జాగ్‌గా నెంబర్లు వేసుకుని వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కోయిలకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపల్లిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు యాదయ్య, కృష్ణయ్య తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్డుకు రూ.8.50 లక్షలు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు డ్రైనేజీ, సీసీ రోడ్ల కోసం రూ.24 లక్షలు, ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.4 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

అపార్ ఐడీ పూర్తి చేయాలి

జడ్చర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరి అపార్ ఐడీ పూర్తి చేయాలని జడ్చర్ల ఎంఈవో మంజులాదేవీ సూచించారు. మండలంలోని నెక్కొండ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించి, ఆరో తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలు పరీక్షించారు. ఉపాధ్యాయులు అమూల్య, చంద్రరేఖ ఉన్నారు.

ప్రజావాణికి మూడు దరఖాస్తులు

దేవరకద్ర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు అధ్యక్షత ఏర్పాటు చేసిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఎంఈవో బాల్‌రాం, వైద్యాధికారి శరత్‌చంద్ర, ఏవో రాజేందర్ అగర్వాల్ పాల్గొన్నారు.

క్వింటాలు కందులు రూ.7,113

దేవరకద్ర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్రకు వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఏడు క్వింటాళ్ల కందులు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,113, కనిష్ఠంగా రూ.7009 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఆముదాలు 15 క్వింటాళ్లు రాగా క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.5,975, కనిష్ఠంగా రూ.5,970 పలికింది.

మైసమ్మ వార్షికోత్సవం ప్రారంభం

నవాబ్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ధ్వజారోహనం, కలశస్థాపన నిర్వహించారు. ఈవో నర్సింహులు, రామస్వామి, మల్లేష్, బక్క బాలయ్య, రవీందర్, మేమ్య, మైనోద్దిన్, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌల్ట్రీఫాం పరిసరాలు శుభ్రంగా ఉండాలి

కోయిలకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పౌల్ట్రీఫాంల వద్ద పరిసరాలు శుభ్రంగా ఉంచే విధంగా నిర్వాహకులు చూడాలని వెటర్నరీ డాక్టర్ నరేష్ సూచించారు. సోమవారం మండలంలోని అంకిళ్ల, ఆభంగపట్నం గ్రామాల్లోని పౌల్ట్రీ ఫాంలను పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. మండలంలో 80 పౌల్ట్రీఫాంలు ఉన్నాయని, కోళ్లకు అనారోగ్యం సోకకుండా ఫీడింగ్ ఎప్పటికప్పుడు ఇవ్వాలని సూచించారు.



మనికొండ ఉన్నత పాఠశాలలో..



జిల్లా కేంద్రంలోని ప్రజ్ఞా పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



సూరారం ఉన్నత పాఠశాలలో..

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్‌లో గల ప్రజ్ఞా పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రిన్సిపాల్‌గా శ్రావణి, కస్పాండెంట్‌గా మహేష్, విద్యాశాఖ మంత్రిగా ఆథిష, కలెక్టర్‌గా సందీప్‌తో పాటు పలువురు డీఈవో, ఎంఈవోగా వ్యవహరించారు. పాఠశాల కరస్పాండెంట్ భూరెడ్డి భీంరెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, అంబిక విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మహమ్మదాఖాన్‌పల్లిలో..

జిల్లా కేంద్రంలోని మహమ్మద్‌ఖాన్‌పల్లి తండా ప్రాథమిక పాఠశాలలో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈవోగా శివ, హెచ్ఎంగా ఉష, పీఈటీగా అర్జున్, ఉపాధ్యాయులగా సావిత్రి, శృతి, లావణ్య, సుస్మిత, హారేరామ్, రితేష్ నందిని, రుషి వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం తిరుపతమ్మ, ఉపాధ్యాయులు శారద, సీఆర్పీ శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి బహుమతులు



గండీడ్ బాలుర ఉన్నత పాఠశాలలో..

మనికొండ ఉన్నత పాఠశాలలో..

మహబూబ్‌నగర్ రూరల్ : మండలంలోని మనికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎంగా రికిత, కలెక్టర్‌గా పల్లవి, ఆర్డీఓగా జానకి, డీఈవోగా స్నేహలత, ఎంఈవోగా కీర్తన వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్ పాల్గొన్నారు.

సూరారం ఉన్నత పాఠశాలలో..

కోయిలకొండ : మండలంలోని సూరారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం మిన్హాజుద్దీన్, ఉపాధ్యాయులు మల్లిఖార్జున్, మధుసూదన్‌జోషి బహుమతులు అందించారు.

గండీడ్ బాలుర ఉన్నత పాఠశాలలో..

గండీడ్ : మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా వైష్ణవి, ఎంఈవోగా ఐశ్వర్య డీఈవోగా తబస్సుమ్, కలెక్టర్‌గా కావ్య, విద్యాశాఖ మంత్రిగా సంగీత తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాకు. ఎంఈవో జనార్దన్ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు జనార్దన్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, శాంతయ్య, కృష్ణారెడ్డి, రమణ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కలెక్టర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా 86 ఫిర్యాదులు రాగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావుకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు.

సదరం సర్టిఫికెట్‌కు యూడీఐడీలో దరఖాస్తు చేసుకోవాలి

దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందుటకు ఇక నుంచి యూడీఐడీ వెబ్ సైట్ నుంచి పొందాల్సి ఉంటుందని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మీ సేవ సెంటర్ నిర్వాహకులకు 21 వైకల్యాలకు సంబంధించి సదరం గుర్తింపు కార్డులు పొందడంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, సూచనలు చేశారు. అవగాహన ఉన్నవారు మొబైల్ ఫోన్ ద్వారా కూడా యూడీఐడీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అదనపు డీఆర్డీవో జోజప్ప, ఈడీఎం చంద్రశేఖర్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ చెల్లింపునకు 25శాతం రాయితీ

▸▸ ఆర్పీలకు అవగాహన కల్పించిన కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చిందని దీన్ని దరఖాస్తు దారులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి కోరారు. ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించేందుకు సోమవారం ఆయన మెప్మా రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో ఆర్పీలు మాట్లాడి వారికి అవగాహన కల్పించి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేలా కృషి చేయాలన్నారు. 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి అప్పటి మార్కెట్ విలువ ప్రకారమే మొత్తం ఫీజులో 25 శాతం రాయితీ ఉన్నందున సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. దీనిపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నామని దరఖాస్తు చేసుకున్న వారంతా ముందుకు రావాలని కోరారు.

ఆసుపత్రిని సందర్శించిన కేరళ బృందం



కేరళ బృందంతో కోయిలకొండ ఆసుపత్రి సిబ్బంది

కోయిలకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కేరళ రాష్ట్ర వైద్య బృందం డాక్టర్ రాజేష్, డాక్టర్ సురేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య సదుపాయాలతో పాటు మందులు కూడా పరిశీలించారు. వంద పడకల ఆసుపత్రి వసతి ఉన్న ఎలాంటి వైద్య పరికరాలు లేకపోవడంతో డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కోయిలకొండలో ఆసుపత్రిని ఎప్పుడు ప్రారంభించారని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కొతలాబాద్, గార్లపాడ్, చంద్రాసుపల్లి సబ్‌సెంటర్‌ను సందర్శించి వైద్య సదుపాలన గురించి తెలుసుకున్నారు.

హర్షవర్ధన్‌కు నాల్గోసారి నిరాశే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాల్గోసారి కూడా నిరాశే ఎదురైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్సీగా కావాలన్న లక్ష్యంతో తన ఉద్యోగానికి రాజీనామా చేసి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ శాసన మండలి స్థానానికి పోటీ చేశారు. మొదట్లో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్‌లో చేరి క్రియాశీలంగా వ్యవహరిస్తు వచ్చారు. ఆ తర్వాత రెండో సారి కూడా పోటీ చేసి ఓడిపోయారు. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి మూడో సారీ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఓడిపోయినా ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతూ సమస్యల సాధనకు కృషి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్పౌజ్ టీచర్ల సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషించి సఫలమయ్యారు. తాజాగా జరిగిన నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ శాసన మండల స్థానం నుంచి పోటి చేసి, మూడో స్థానంలో నిలిచారు. నాల్గోసారి కూడా ఓటమి పాలు కావడంతో నిరాశే మిగిలింది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మూసాపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం రూ.45 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, ఈవో రాజేశ్వర్‌శర్మ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి, నాయకులు బుచ్చన్నగౌడ్, రాములు, దేవన్నయాదవ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా అడ్డాకుల మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో మంజూరైన సీసీ రోడ్డు పనులను డీసీసీ జిల్లా కార్యదర్శి గంగుల విజయమోహన్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కోటాల వేగనాథ్, రామన్న, శ్యామ్ పాల్గొన్నారు.

ఎండిన వరి

▸▸ పశువులకు మేత



అంబటోనిపల్లి గ్రామంలో బోరుబావిలో నీరు తగ్గడంతో ఎండిన వరి పంటను గొర్రెలకు మేపుగా వదిలిన రైతు

హన్వాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు సంవృద్ధిగా కురియడంతో రైతులు పంటలు సాగు చేశారు. కాగా ఒక్క సారిగా భూగర్భ జలాలు తగ్గడంతో బోరుబావుల్లో నీరు తగ్గి సాగు చేసిన వరి పంట ఎండిపోతోంది. ఫిబ్రవరి నెల నుంచే భూగర్భ జలాలు తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఎండిన పంటను రైతులు గొర్రెలు, పశువులతో మేపుతున్నారు. మండలంలో దాదాపుగా 7 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మండలంలోని ఇబ్రహీంబాద్, టంకర, గుడిమ ల్యాపూర్, నాయినోనిపల్లి, కొనగట్టుపల్లి గ్రామాల్లో ఎక్కువ గా వరి పంట ఎండిపో యింది. చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోయాయి. మరో పక్క కరెంట్ కోతలు మొదలయ్యాయి. లోడ్ పెరిగినప్పుడు త్రీఫేజ్ కరెంట్ సరఫరాను నిలిపివేసి, సింగిల్ ఫేజ్‌ను అందిస్తున్నారు. ఇలాగే రోజు రోజుకూ నీరు తగ్గిపోతే మిగిలిన పంట కూడా చేతికందని పరిస్థితి ఏర్పడుతోంది.

ఎకరా వరి పంట ఎండిపోయింది.



నాకున్న రెండెకరాల్లో వరి పంటను సాగు చేశారు. భూగర్భ జలాలు పూర్తిగా తగ్గడంతో ఒక ఎకరా పంట ఎండిపోయింది. దీంతో గత్యంతరం లేక గొర్రెలను మేపుతున్నాం. గత సంవత్సరం ఇలా జరగలేదు. ఈ సంవత్సరం బోరు బావుల్లో నీరు అడుగంటి పోయింది.

- బసప్ప రైతు, అంబటోనిపల్లి

పీఆర్టీయూ ఆధ్వర్యంలో సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న పీఆర్టీయూ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ శాసన మండలి స్థానానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడంతో మహబూబ్ నగర్ జిల్లా పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బుచ్చారెడ్డి మాట్లాడారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న శ్రీపాల్‌రెడ్డి నల్గొండ, ఖమ్మం, వరంగల్ నుంచి ఎమ్మెల్సీగా విజయం సాధించడం ఇది ఉపాధ్యాయుల విజయం అన్నారు. పీఆర్టీయూ టీఎస్ నిత్యం ఉపాధ్యాయుల సమస్యలపై నిరతరం పోరాడుతుందన్నారు. ఎన్నికల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు శ్రీపాల్‌రెడ్డి బ్రహ్మారథం పట్టారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు, రెండో ప్రాధాన్యత ఓట్లతో శ్రీపాల్‌రెడ్డి ముందువరసలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, అశ్విని చంద్రశేఖర్, పురుషోత్తంగౌడ్, సురేష్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు అక్తర్, విజయానంద్‌రెడ్డి, స్వామి, భీంరెడ్డి పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అరుణాచల గిరి ప్రదర్శనకు ఈనెల 14న ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 12న రాత్రి 7 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలు దేరి ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనం, వెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణాచలేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ అనంతరం 14న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి 15న ఉదయం మహబూబ్‌నగర్ చేరుకుంటుందని తెలిపారు.

‘భూములు మునిగిపోతున్నాయి.. ఆదుకోవాలి’

భూత్పూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : చెరువులో మా భూములు మునిగిపోతున్నాయి.. ఆదుకోండి అంటూ మండలంలోని హస్నాపూర్ గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ అధికారులకు వేడుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కొండయ్య, మణెమ్మ, నర్సిములు, మునయ్య, బాలయ్య, సోంభూపాల్‌రెడ్డి, లలితమ్మ, వెంకటమ్మ, రాజు, వెంకటయ్య కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ప్రజావాణిలో మా భూములు తాటికొండ శివారులో ఉన్న చెరువులో మునిగిపోతున్నాయని ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చే మురుగు నీరు ప్రతి రోజు కాల్వ ద్వారా పారుతుండడంతో దాదాపు 100 ఎకరాలు మునిగిపోతున్నాయని రైతులు విన్నవించారు. హస్నాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు.

‘మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్’

మిడ్జిల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని టీపీసీసీ కోఆర్డినేటర్ కొప్పుల మధు అన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఆత్మీయ భరోసా పథకం ద్వారా మల్లాపూర్ గ్రామానికి చెందిన మహిళలకు ఆత్మీయ భరోసా డబ్బులు అకౌంట్లలో పడటంతో సోమవారం ఉపాధి హామీ కూలీలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.


తండ్రి, కుమారుల అదృశ్యం

జడ్చర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : టిఫిన్ తినిపించుకుని వస్తానని చెప్పి నాలుగు సంవత్సరాల కుమారుడు నానిని తీసుకెళ్లిన తండ్రి చెన్నయ్య కనిపించడం లేదంటూ చెన్నయ్య భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్నారని, ఆదివారం సంసారం విషయంలో భార్యాభర్తలు గొడవపడ్డారని పేర్కొన్నారు. అనంతరం కుమారుడితో పాటు బయటికి వెళ్లిన తన భర్త చెన్నయ్య తిరిగి రాకపోవడంతో సోమవారం అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

టీవోఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ నియామకం అక్రమం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : టీవోఎస్ఎస్ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) జిల్లా కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్న శివయ్య (ఎస్ఏ ఇంగ్లిష్ జడ్పీహెచ్ఎస్ మూసాపేట)ను ఆ పోస్టులో నియమించడం విరుద్ధమని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ నాయకులు వస్పుల రమేష్, నాగం రఘురాంరెడ్డి, నాగరాజు, ఆవుల వెంకట్‌రాములు అన్నారు. ఆయన నియామకం గత డీఈవో రవీందర్ ఉన్నతాధికారులను తప్పుతోవ పట్టించి నియమించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని పలు మార్లు ప్రజావాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. శివయ్యను తొలగించి నిబంధనల మేరకు సీనియార్టిని పరిగణలోకి తీసుకొని ఆ పోస్టుకు న్యాయం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజీ పడొద్దు



శిక్షణ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైద్యం భాస్కర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజీ పడొద్దని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైద్యం భాస్కర్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌స్ట్రక్షన్ సెంటర్‌లో హౌసింగ్ కార్పొరేషన్ సహకారంతో నిర్మాణ మేస్త్రీలకు ఆరు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, రూ.5 లక్షల బడ్జెట్‌లో ఎలా నిర్మించాలో ఆయన పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తక్కువ బడ్జెట్ ఎక్కువ మన్నికపై నూతన గృహ నిర్మాణంలో కొత్త టెక్నాలజీ వినియోగంపై వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై రాసిన పాటను పాడి వినిపించారు. ఈ సందర్భంగా సేఫ్టీ మెటీరియల్ హెల్మెట్, టీషర్ట్, బ్యాగ్, బుక్, పెన్ను అందించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.